రేపు వేములవాడలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

వేములవాడ రాజన్న గుడి చెరువులో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, స్థానిక నాయకులు

వేములవాడ/వేములవాడ టౌన్/కలెక్టరేట్, నవంబర్ 18: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 20న వేములవాడలో పర్యటించనున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, జిల్లా పోలీస్ కార్యాలయం, మెడికల్ కళాశాలతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాలు చేయనున్నారు. ఆలయ అభివృద్ధి పనులకు రాజన్న ఆలయంలోనే శిలాఫలకాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వేములవాడలో సీఎం రేవంత్ రెడ్డి ముందుగా ఆలయంలో స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ అధికారులతో సమీక్షించారు.

ఏర్పాట్ల పరిశీలన

రాజన్న గుడి చెరువులో సభా స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిశీలించారు. అలాగే, వేములవాడ ఆలయంలో ఏర్పాట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఇక్కడ అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణ, ఆర్డీవో రాజేశ్వర్, ఆలయ ఈఈ రాజేశ్, ఏఈ రాంకిషన్‌రావు తదితరులున్నారు.

రాజన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారి

మండపంలో ఐఏఎస్ అధికారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఈవో

వేములవాడ టౌన్, నవంబర్ 18 : కార్తీకమాసం సందర్భంగా వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి వారిని సోమవారం ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ దర్శించుకున్నారు. ఆలయంలో రాజన్నకు కోడెమొక్కు తీర్చుకున్నారు. ఆలయంలో వారు స్వా మి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేయ గా, ఈవో వినోద్‌రెడ్డి వారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, ఆలయ ఏఈవో శ్రీనివాస్ తదితరులున్నారు.

'కాటన్ పరిశ్రమకు ప్రోత్సాహమందించాలి'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 18: సిరిసిల్ల కాటన్ పరిశ్రమకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్దాల కాలంగా నాణ్యమైన చీరెలు ఉత్పత్తి చేసిన చరిత్ర సిరిసిల్లకు ఉందన్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాలకు ఇక్కడి నుంచి అందించామన్నారు. పాలియిస్టర్ పరిశ్రమ ఏర్పాటుతో కాటన్ పరిశ్రమ కనుమరుగై పోయిందన్నారు. ఎకో ఫ్రెండ్లీ అని చెప్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాటన్ పరిశ్రమకు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచన చేసి కాటన్ పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు గౌడ వాసు, గాజుల రవి, మనోహర్, నటరాజ్, తదితరులున్నారు.

గోరుముద్ద ప్రారంభం

గొల్లపల్లిలో గోరుముద్దను ప్రారంభిస్తున్న హెచ్ఎం, ఆంజనేయులు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 18: గొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించే గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు పాక మురళీధర్ సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కొండ ఆంజనేయులు ఆర్థిక సహకారంతో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు సంజీవ్, దేవయ్య ఉన్నారు.

'కేకే' వర్సెస్ 'ఉమేశ్'

- పార్టీలో ఆధిపత్యానికి రెండు వర్గాల ప్రయత్నాలు
- సోషల్ మీడియాలో పోస్టులు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 18: మండలంలో కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో నివురుగప్పిన నిప్పులా రెండు వర్గాలు ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ఏర్పాటుతో ఓ వర్గం రగిలిపోతుండడం, మరో వర్గం తమకు అధిష్టానం ఆశీస్సులున్నంతకాలం తమదే పైచేయి అన్నట్లు వ్యవహరిస్తుంటుండగా రెండు వర్గాల వ్యవహారాలు అధిష్టానానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నది. ఇటీవల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో బాహాటంగానే ఏండ్ల తరబడి జెండాను మోసిన ప్పటికీ మార్కెట్ కమిటీలో అవకాశం రాలేదని మండిపడ్డారు. ఎవరెవరు అధికారుల వద్ద ఎలాంటి పైరవీలు చేస్తున్నారో తప్పకుండా బయటపెడుతామని హెచ్చరించగా పార్టీ కార్యకర్తలు కొందరు కల్పించుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఈ క్రమంలోనే రెండు రోజులుగా కేకే మహేందర్‌రెడ్డి, చీటి ఉమేశ్‌రావు వర్గాలుగా చీలిపోయిన కార్యకర్తలు తమ సోషల్ మీడియా గ్రూపులో ఒకరిపై మరొకరు విమర్శ, ప్రతివిమర్శ చేసుకున్నారు. ఓ వర్గానికి చెందిన వ్యక్తి గ్రూపులో ఉమేశ్‌రావు అనుకూల పోస్టులు చేస్తే గ్రూపు నుంచి తొలగిస్తామని, దమ్ముంటే ఉమేశ్ రావుతో రూ.10లక్షల పని చేయించాలని హెచ్చరించాడు. దీనికి స్పందించిన ఉమేశ్‌రావు వర్గం వ్యక్తి ఉమేశ్‌రావు కాంగ్రెస్ కార్యకర్త కాదా? అధికార ప్రతినిధిగా ఉన్నాడు కదా ?ఎందుకు అనుకూల పోస్టులు పెట్టకూడదు? అని దీటుగా బదులివ్వడంతో ఇరువర్గాల మధ్య గొడవ తారాస్థాయికి చేరుకున్నదని ఆ పార్టీ కార్యకర్తలే బాహాటంగా చెపుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ గొడవలు దేనికి దారితీస్తాయో అని ఆ పార్టీ కార్యకర్తలు ఇరువర్గాలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల సేకరణ

ముస్తాబాద్, నవంబర్ 18 : గూడెం గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో స్థానికులు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ ముందుకు వచ్చి పనులను చేపట్టగా విరాళాలు అందించేందుకు గ్రామస్తులు, భక్తులు ముందుకు వచ్చారు. సోమవారం గీత కార్మికులు రూ.5116 అందించారు. వారికి ఆలయ కమిటీ పక్షాన గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బడులకు తాళం.. పిల్లలు ఆగం

- సమగ్ర సర్వేలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు
- పలుచోట్ల మధ్యాహ్నమే పాఠశాలల మూసివేత
- ఇంటికెళ్లి ఆడుకుంటున్న చిన్నారులు
- కుంటపడుతున్న ప్రాథమిక విద్య
- ఆందోళనలో విద్యార్థులు తల్లిదండ్రులు

మామిడిపల్లిలో ఇంటి వద్ద ఆడుకుంటున్న విద్యార్థులు

మామిడిపల్లిలో మధ్యాహ్నం బడి మూసివేయడంతో ఇంటికెళ్తున్న విద్యార్థులు

కోనరావుపేట, నవంబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టగా, జిల్లాలోని కొన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఒంటిపూటే కొనసాగుతున్నాయి. ఉపాధ్యాయులు ఉదయం వేళలో పాఠాలు బోధించి, మధ్యాహ్నం సర్వే విధులకు వెళ్తున్నారు. దీంతో కొన్నిచోట్ల బడులకు మధ్యాహ్నమే తాళం వేసి మూసివేయడంతో విద్యార్థులు ఇంటికెళ్లి ఆగమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఒంటిపూటే నిర్వహిస్తుండడంతో ప్రాథమిక విద్య కుంటపడుతోందని, విద్యార్థులు నష్టపోతున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్నమే బడుల మూసివేత..

జిల్లాలో 334 ప్రాథమిక పాఠశాలలు ఉండ గా, ఇందులో 430మంది ఉపాధ్యాయులు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు కేటాయించారు. వీరంతా పాఠశాలలకు చేరుకుని ఉదయం పూట విద్యార్థులకు చదువు చెబుతున్నారు. మధ్నాహ్న సమయంలో సర్వే చేస్తున్నారు. వయసు పైబడి రిటైర్డ్‌మెంట్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నవారికి కూడా సర్వే విధులు కేటాయించారు. మరి కొంత మందికి అనారోగ్య సమస్యలున్నా డ్యూటీ వేశారు. చాలాచోట్ల పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులుంటే ఒకరు బడిలో, మరొకరు సర్వే చేస్తున్నారు. ఇక సర్వే లేని వారు సైతం పాఠశాలలను మధ్యాహ్నమే మూసివేసి వెళ్తున్నట్లు తెలుస్తోంది.

పొద్దున బడికి.. మధ్యాహ్నం సర్వేకు..

సమగ్ర సర్వే జరిగినన్ని రోజులు ఉపాధ్యాయులు ఉదయం 9:05నుంచి మధ్యాహ్నం 12:05 గంటల వరకు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తారు. మధ్యాహ్న భోజనం తర్వాత సాయం త్రం వరకు ఇంటింటా సర్వే చేపడుతున్నారు. మధ్యాహ్నం 12:45 గంటలకు పలు ప్రాథమిక పాఠశాలలు మూతపడడంతో విద్యార్థులు ఇంటిముఖం పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒంటి బడులు నిర్వహించడంతో ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

పిల్లల బాగోగులు చూసేవారేరి?

గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెంది న విద్యార్థులు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలకు వెళ్తుంటారు. వారి తల్లిదండ్రులు వ్యవసాయంతోపాటు కూలి చేస్తుంటారు. ఈ క్రమంలో వారు ఉదయాన్నే పనులకు వెళ్లి.. సాయంత్రం ఇంటికి వస్తారు. సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో విద్యార్థులు మధ్యాహ్నమే ఇంటికి వస్తుండడంతో వారి బాగోగులు చూసేవారు లేరని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళ న చెందుతున్నారు. మధ్యాహ్నమే విద్యార్థులు ఇంటికొచ్చి ఆడుకోవడంతో వారి చదువుపై ప్రభావం పడుతోందంటున్నారు.



మామిడిపల్లిలో సర్వే నిర్వహిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

గ్రామంలో మూసివేసిన పాఠశాల

రుణాల సద్వినియోగంపై మహిళలకు అవగాహన

ముస్తాబాద్, నవంబర్ 18 : మండలంలోని స్వశక్తి మహిళా గ్రూప్ సభ్యులకు రుణాల సద్వినియోగంపై గ్రూప్ సభ్యులు, వీవోలకు ఐకేపీ సిబ్బంది అవగాహన కల్పించారు. గత సంవత్సరం నుంచి పొందిన రుణాలు వాటి ద్వారా పొందుతున్న ఆర్థిక వివరాలపై యూనిట్ సభ్యులు తమ అభిప్రాయాలు తెలియజేశారు. ఇక్కడ మహిళా సంఘాల సభ్యులు, గ్రూప్ లీడర్లున్నారు.

గల్ఫ్ సంక్షేమ నిధి ద్వారా ఆర్థిక సాయం

ముస్తాబాద్, నవంబర్ 18 : మండల కేంద్రంలోని వెంకయ్యకుంటకు చెందిన పిట్ల మహేశ్ సౌదీ వెళ్లగా, ఐదు నెలలకే గత జూలై 4న గుండె పోటుతో మృతి చెందాడు. కాగా, ఇటీవల గల్ఫ్ కార్మికుల సంక్షేమ నిధి ద్వారా మహేశ్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని, ఈ చెక్కును ఈనెల 20న వేములవాడలో సీఎం చేతుల మీదుగా అందజేస్తారని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం నాయకుడు జనగామ శ్రీనివాస్ సోమవారం తెలిపాడు.

ప్రభుత్వం మత్స్యకారులను గుర్తించాలి

గంభీరావుపేట, నవంబర్ 18: గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా చెరువులలో పూర్తిస్థాయిలో ఉచితంగా చేపపిల్లలను వదుతులూ కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులను గుర్తించాలని మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుతారి బాలవ్వ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016 నుంచి 2023 వరకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జూలై-ఆగస్టు మాసంలో పూర్తిస్థాయిలో ఉచితంగా చెరువుల్లో చేపపిల్లలను పంపిణీ చేసిందని వారు గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం నవంబర్‌లో చేప పిల్లల పంపిణీ చేయడంతో మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని 440 చెరువుల్లో గత ప్రభుత్వం 1 కోటీ 40 లక్షల పిల్లలను పంపిణీ చేసిందని, ఈ ఏడాది 75 లక్షల చేప పిల్లలను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. చెరువుల్లో నీటి సామర్థ్యం మేరకు పూర్తిస్థాయిలో చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారులను ఆదుకోవాలని తెలిపారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

రుద్రంగిలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

రుద్రంగి, నవంబర్ 18: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీలత సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సోమవారం రుద్రంగి మండల కేంద్రంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను తహసీల్దార్ శ్రీలత పరిశీలించారు. సర్వేపై ఎన్యూమరేటర్లకు తగిన సూచనలు ఇచ్చామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, ఏఎస్ఓ గణేశ్, రెవెన్యూ సిబ్బంది, ఎన్యూమరేటర్స్, గ్రామస్తులున్నారు.

కనులపండువగా దీపాలంకరణ

ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబర్ 18 : కార్తీకమాసం సందర్భంగా రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్ పైన సోమవారం సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా భక్తులు వెలిగించిన దీపాలతో ఆలయ ప్రాంగణం కనులపండువగా కనిపించింది. భక్తులు దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీరాం భట్టార్ హరికథా కాలక్షేపం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలింగార్చన

వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో ఆలయ ఆధ్వర్యంలో అర్చకులు మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం రాజన్న ఆలయంలో స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీభీమేశ్వరాయం మండపంలో 365 జ్యోతులను లింగాకారంగా పేర్చి దాదాపు 2 గంటలపాటు లింగార్చనను కనులపండువగా నిర్వహించారు. ఇక్కడ ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, భక్తులున్నారు

శ్రీభీమేశ్వరాలయం మండపంలో మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వీర సైనికులకు ఘన నివాళి

వేములవాడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యాదవ సంఘం నాయకులు

వేములవాడ, నవంబర్ 18: రేజాంగ్ లా శౌర్య దివస్ సందర్భంగా వేములవాడ పట్టణంలోనీ అమరవీరుల స్తూపం వద్ద వీర మరణం పొందిన జవాన్లకు యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘన నివాళులు అర్పించారు. 1962 నవంబర్ 18న భారతీయులు దీపావళి పండుగను జరుపుకుంటున్న సమయంలో ఇండియాపై చైనా సైనికులు చేసిన దాడిలో 144 మంది యాదవ జవాన్లు వీర మర ణం పొందారు. ఈసందర్భంగా రాష్ట్ర యువజన కార్యదర్శి అంబటి సంతోష్ యాదవ్, పట్టణాధ్యక్షుడు అంబటి చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో వీర మరణం పొందిన సైనికులకు తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు జడల శ్రీనివాస్ యాదవ్, శీలం శ్రీనివాస్ యాదవ్, నక్క కొమురయ్య యాదవ్, కుడుకల తిరుపతి యాదవ్, నలిగేటి లింగం యాదవ్, నలిగేటి శ్రీనివాస్ యాదవ్, అత్తెని మల్లేశ్ యాదవ్, కుమార్ యాదవ్, నారకట్ల మహేందేర్ యాదవ్, పోశవేణి శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.

పుస్తె మట్టెల అందజేత

ముస్తాబాద్ మల్యాల చంద్రయ్య దంపతులకు చిట్నేని వెంకటేశ్వర్ రావు వితరణ చేసిన పుస్తె మట్టెలు అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్, నవంబర్,18 : మండల కేంద్రానికి చెందిన నిరుపేద మల్యాల లక్ష్మీ-చంద్రం దంపతుల కుమార్తె సుస్మిత వివాహానికి గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాధవి-వెంకటేశ్వరరావు దంపతులు పుస్తె-మట్టెలు చీర, బియ్యం వితరణ చేశారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులు వారి ఇంటికి వెళ్లి పుస్తె మట్టెలు, చీరను వధువు తల్లిదండ్రులకు అందించారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మిరుదొడ్డి శేరయ్య, శీలం స్వామి, సుంచు గణేశ్, సుధాకర్, సుదర్శన్, రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు.. కలియదున్నాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి దుర్గరాజు

చందుర్తి, నవంబర్ 19: వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి దుర్గరాజు అన్నారు. సోమవారం మండలంలోని అనంతపల్లి గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి కొయ్యలను తగలబెట్టకుండా భూమిలో కలియ దున్నడం ద్వారా సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. వరి కొయ్య కాలుకు నిప్పు పెట్టడం ద్వారా పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తాయన్నారు. దున్నే ముందు సూపర్ ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు గడ్డి తొందరగా కుళ్లిపోతాయని తెలిపారు. దీంతో ఎరువుగా మారి పంట దిగుబడి పెరగడంతో పాటు, రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఒకే నెలలో రెండు ప్రభుత్వోద్యోగాలు

సింధు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 18: కోనరావుపేట మండలం ధర్మారానికి చెందిన పొన్నం ఎల్లయ్య-పద్మ దంపతుల కూతురు సింధు పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను చాటి నెల వ్యవధిలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. సింధు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అమ్మమ్మ ఇంటిలో విద్యాభ్యాసం కొనసాగించి ఇటీవల గ్రూప్-4 ఉద్యోగం సాధించగా, రెండు రోజుల క్రితం బ్యాంకు ఉద్యోగాన్ని సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సింధును పలువురు నాయకులు అభినందించారు.

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

- 3,757 మంది అభ్యర్థులు హాజరు

తెలంగాణ చౌక్, నవంబర్ 18: జిల్లా వ్యాప్తంగా గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జేఎన్టీయూ ప్రిన్సిపాల్, ఆర్వీవో వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో 7062 మంది అభ్యర్థులకు 3,757 మంది హాజరు కాగా, 3,305 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పోలీస్ బందోబస్తు మధ్య ఎలాంటి అవాంతరాలు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

నోటు పుస్తకాల అందజేత

వీర్నపల్లి, నవంబర్ 18: గర్జనపల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జేఎన్‌టీయూ విద్యార్థి నేత ఎరవెల్లి జగన్ సోమవారం పుస్తకాలను అందజేశారు. మారుమూల ప్రాంత విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జగన్ సూచించారు. ఇక్కడ హెచ్ఎం శ్రీనివాస్, ఎస్‌డీసీ చైర్మన్ రాకేశ్, ఉపాధ్యాయులు జగన్, నేతలు ప్రశాంత్, దేవేందర్, శంకర్, తదితరులున్నారు.

బాల్య మిత్రుడికి సాయం

వీర్నపల్లి, నవంబర్ 18: అనారోగ్యంతో బాధపడుతున్న బాల్య మిత్రుడికి సాయం అందించి మానవత్వం చాటుకున్నాడు ఓఎన్ఆర్ఐ. మండల కేంద్రానికి చెందిన పిట్ల మోహన్‌కు రెండు కిడ్నీలు చెడిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ రాధారపు సత్యం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15వేలు అందించి అండగా నిలిచారు. ఇక్కడ లోకుర్తి తిరుపతి, పెడతనపల్లి శేఖర్, తదితరులున్నారు.

సర్వే గడువును పొడిగించాలి

చందుర్తి, నవంబర్18: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే గడువును మరో పది రోజులు పొడిగించాలని టీపీటీఎఫ్ చందుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సంజీవ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేలో ఇచ్చిన 75 ప్రశ్నలకు కుటుంబ యజమాని నుంచి సమాధానాలు సేకరించి ఫారం పూర్తి చేసేసరికి 30నుంచి 45నిమిషాల సమ యం పడుతుందన్నారు. రోజుకు 5 నుంచి 10 కుటుంబాల సర్వే మాత్రమే ఎన్యుమరేటర్లు చేయగలుగుతున్నారని పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో సర్వే వల్ల మహిళా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారనారు. ఒక్కొక్కరికి 150 నుంచి 180 కుటుంబాల సర్వే బాధ్యతను ఇవ్వడం వల్ల ఎన్యుమరేటర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం సర్వే గడువును మరో పది రోజులు పొడిగించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇల్లంతకుంట, నవంబర్ 18 : మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్ ఇల్లంతకుంట పరిధిలోని గ్రామాల్లో ఈ విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

సీఎచ్‌సీకి పిల్లల డాక్టర్

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 18: కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రెండ్రోజుల క్రితం పిల్లల డాక్టర్‌ను కేటాయించిన నేపథ్యంలో సోమవారం నూతన పీడియాట్రిక్ డాక్టర్ ఓంకార్ విధుల్లో చేరారు. ఈ వివరాలను ఫిజీషియన్ బాబు వెల్లడించారు. హాస్పిటల్‌లో పిల్లల డాక్టర్ లేక ఇబ్బందులు పడ్డ ప్రజలు మండల కేంద్రంలోని, సిరిసిల్ల ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లేవారు. ఈ క్రమంలో సూపరింటెండెంట్‌గా బాబు చొరవ, అధికారుల సహకారంతో నూతన పీడియాట్రిక్ డాక్టర్ విధుల్లో చేరారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ యజమానులకు అవగాహన

ఇల్లంతకుంట, నవంబర్ 18 : ఇసుక ట్రాక్టర్ల యజమానులకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఫారుక్ సమక్షంలో సోమవారం ఎస్ఐ కదిరె శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అనుమతి తీసుకున్న వద్ద నుంచే లోడ్ చేసుకుని అనుమతి తీసుకున్న ప్రాంతానికే తరలించాలని తెలిపారు. మండలంలోని పొత్తూరు రైతులను ఇబ్బంది పెట్టవద్దని, రోడ్డుపై ఓవర్ స్పీడుతో వెళ్లినా చర్యలు తప్పవన్నారు. ఇక్కడ ఆర్ఐ షఫీతోపాటు ఇసుక ట్రాక్టర్ల యజమానులున్నారు.